

# అమెరికా అమ్మాయి

– శ్రీనిధి యెల్లల



## లైక్..కామెంట్..షేర్..!!

అడుగు తీసి అడుగు జాగ్రత్తగా పెట్టాలి...చూసుకో చూసుకో. ఎటు చూసినా ఇంటి నిండా అట్టపెట్టెలే. ఏమరుపాటుగా ఉంటే నిన్ను కూడా 'బబుల్ ర్రాప్' లో చుట్టేసి అట్టపెట్టెలో పెట్టి పార్సెల్ చేసేస్తారు. 'హాలిడే సీజన్లో ఆనందాల డెలివరీ' అని టాగ్ లైన్ స్టిక్కరు ఒకటి అంటించేస్తారు. పాపేది? అదిగో గోడమీద స్లైమ్ తో పిడకలు వేస్తోంది. ఇతగాడేడీ? గుర్రపు పందేలలో లాగా ఏ షాప్ ఎలాంటి జిమ్మిక్కులు వేసి ఈ సీజన్ మార్కెట్ లో ముందుంటుందో అని గడ్డాలు మీసాలు పెంచేసి మరీ పరిశోధన చేస్తున్నట్టున్నాడు. ఒకటే హడావిడిలో ఉన్నారు అంతా. పిలిస్తే ఒక్కరూ పలకరేంటి! మనుషులకన్నా ముందు అలెక్సా, హే గూగుల్ అందుకుంటున్నాయి. "ఎవరక్కడా?!" అని చిటికెయ్యగానే పరిగెత్తుకొచ్చే పరిచారికలాగా. ఈయనతో తలనొప్పి అంటే ఏ మందు వేసుకోవాలో అదే చెప్పేస్తోంది. "అమ్మా కథ చెప్పవా," అని బుడ్డి అడిగితే నేను ఆలోచించుకునే లోపే, "ఇదిగో ఏ కథ కావాలి ఇందులో!" అంటూ లిస్టు చదివేస్తోంది అలెక్సా. పెళ్ళైన ఇన్నేళ్ళలో నన్ను కూడా ఇన్నేసి సార్లు పిలిచివుండడు. ఇద్దరి మధ్యా ఎన్ని 'పతి పత్ని ఔర్ వో (లు)?' అలెక్సా లైట్ వెయ్యి, అలెక్సా టైం ఎంత, అలెక్సా అలారం పెట్టి లేపవోయ్, అలెక్సా మందు గుర్తు చెయ్యవోయ్, అలెక్సా జోల పాడు అని. ఛీ ఛీ... అయినా ఈ సేవలకేనా ఉండేది?

"కబుర్లు చెప్పుకుంటూ కలిసి భోంచేద్దామా?" అని అడిగి చూడు ...స్త్రీ సాధికారత, సమానత్వం, మట్టిగడ్డ కోనేట్లో దీపంలా జాగ్రత్తగా కాసేపు వదిలేసి వచ్చెయ్యనూ. నీకు అడగడం రాదూ. నాకు అడిగించుకునేలా చేయడం రాదు. బలవంతపు విరహం. 'నెసెసిటీ ఈస్ ది మదర్ ఆఫ్ ఇన్వెన్షన్?' కాదు కాదు. నిత్యావసరాలు అన్ని కనిపెట్టేసారు కదా ఎప్పుడో. ఇహ 'బద్ధకం ఈస్ ది మదర్ ఆఫ్ నేటి కొత్త ఇన్వెన్షన్స్.'

పారిస్ ట్రిప్ వెయ్యకుండానే ఈ యేడూ అయిపోతోంది. ఊర్లో ఎదురింటి అరుగు పైన కూర్చుని చెనిక్కాయలు వలుచుకుంటూ వచ్చే పోయే వాళ్ళని పలకరించే బామ్మ టిక్ టాక్ వీడియో చేస్తే, అది వైరల్ అయ్యి ఇంస్టా రికార్డ్స్ బ్రేక్ చేసిందిట. చూసావా? నేను కూడా చుక్కుడు కాయలు వలుచుకుంటూ నాకూ ఒక రోజు వస్తుంది అని ఎదురుచూడాలా? "ఇప్పుడేం తక్కువా?" ఏమో తెలీదు. "ఎక్కడ వెలితి?" ఎవరికి కావాలీ!

ఇది మళ్ళీ కొత్త డ్రెస్సుతో స్టేటస్ మార్చిందీ! ఏడాది క్రితం వేలు పోసి కుట్టించుకున్న గాగ్రా – పరికిణీ(?) వెక్కిరిస్తోంది పెట్టెలోంచి. కనీసం పార్కుకి వెళ్ళి ఫోటో తీసి అప్లోడ్ చేసెయ్యాలి. సందర్భాలు సృష్టించుకోవాలి మరి. చిన్నప్పుడు అన్నిట్లో పోటీకి వచ్చేది. శనివారం మంచి గౌను వేసుకుని స్కూలుకి వెడితే కుళ్ళి చచ్చేది. ఏ పోటీలోనైనా గెలిచి స్టీలు గిన్నో గ్లాసో గెలిస్తే గ్రూపులు కట్టి ఎవర్నీ నాతో మాట్లాడనీయకుండా చేసి వేపుకు తినేసేది. స్కూల్ తో పాటే ఈ గోలా వదిలిపోయింది అంటే మళ్ళీ చుట్టుకుంది వాట్స్ ఆప్లో. జ్ఞాపకాలన్నీ ఎప్పటికప్పుడు గుర్తుచేస్తుంటే ఎట్టా చచ్చేది. అన్నీ మంచి అనుభూతులు ఉండొద్దూ. పాతబడనిస్తే కదా జ్ఞాపకాలు అయ్యేవి. కోరి తెచ్చుకున్న సోషల్ మీడియా.

ఏనుగంత హార్ట్ షేపు బెలూన్. వార్నీ! చుట్టూతా జపాన్ అమ్మాయిలు బొమ్మల్లా రెడీలయ్యి డాన్స్ చేస్తున్నారు. పొగ... మేఘాలా? ఫోటోగ్రాఫర్ వచ్చి బుడగ పగలగొట్టాడు. అందులో పెళ్లి కూతురూ పెళ్లి కొడుకూనూ. చక్కగా ప్రాక్టీస్ చేసిన పాటకి డాన్సు చేస్తున్నారు. ఛ ఛ ... అనవసరంగా ముందే పెళ్లి చేసేసుకున్నా. ఇట్లాంటి ఫోటోషూట్లు లేవే అప్పట్లో. ఎంచక్కా నేను కూడా ఏ 'ఆల్చిప్ప'లోనో, 'ఐరావతం'లోనో పందిట్లోకి

వచ్చేదాన్ని కదూ! అయినా కళా పోషణ మనకి ఉంటే సరిపోతుందా! కిడ్నాప్ చేసి ఎత్తుకొచ్చి బలవంతంగా పెళ్లి చేస్తున్న 'బిహారి పెళ్లికొడుకులా' బిగుసుకుని కూర్చుంటే ఇతగాడు!

"'గర్భకోశ వ్యాధులూ, కాన్సర్ నివారణకు వంటింటి చిట్కా', అనే వీడియో పంపించాను. నువ్వు రిప్లై ఇవ్వలేదేంటి అమ్మాయ్." నిలదీస్తున్నారు అత్తయ్య. 'వీడియో కాల్లో మొహంలోని భావాలు కనిపించకుండా మాట్లాడడం ఎలా?' అనే వీడియో చేసి యూట్యూబ్ లో పెడితే ఎలా ఉంటుంది? 'అక్కా వీలైతే మాక్ బుక్ ప్రో కుదిరితే ఒక ఐ ఫోనూ.' వినయ విధేయ బీరకాయ పీచు తమ్ముడి వాట్సాప్ వేడుకోలు.

"ఇదుగో అమ్మాయ్. బోటనీ ఫ్యామిలీ పేర్లూ, జువాలజీ స్పీసీస్ పేర్లతో కుస్తీ పట్టక్కర్లేదు ఇక. మీతో ఇమడలేక, ఓటమి ఒప్పుకోలేక మొత్తంగా సెలవు తీసుకోక్కర్లేదు. మేమూ సాధిస్తాం. చూస్తూ ఉండండి."

ఎవరదీ. ఎక్కడో బాగా విన్నట్టుందే? వెళ్ళిపోతోంది ఆ అమ్మాయి. మోచేతి మీద పుట్టు మచ్చ. చింతపిక్క అంతది. సింధూరి కదూ. విజయవాడ ఎంసెట్ బైపిసీ J1 సెక్షన్లో ఎస్ఎస్సి టాపర్. తెలుగు మీడియం పిల్ల. ఎంత కసిగా చదివేదనీ. ఫస్ట్ టర్మ్ ఎంసెట్ మాక్ టెస్టులో ఒకేసారి ఇంగ్లీషులో సైన్సు చదవలేక ఉక్కిరి బిక్కిరి అయిన పిల్ల. "భట్టీ కొట్టి లాగించేసావా పదోతరగతి?" అని మాస్టారు వెక్కిరిస్తే, మేమంతా తెలిసీ తెలీని వయసులో నవ్వి అల్లరి చేస్తే బలవంతంగా ప్రాణం తీసుకున్న సింధూరి. 'మార్పు మొదట ప్రశ్నించబడుతుంది.' యండమూరి గారు చెప్పారా? మార్పు మంచిదేనేమో? ఎన్ని మట్టిలో మాణిక్యాలు మెరుగు పెట్టించుకుని ధగ ధగ లాడతాయో చూడాలి. 'చదువే ఆస్థి' అని ఒక తరాన్ని తయారు చేస్తే మొత్తం ఒక్కసారిగా మధ్యతరగతి కొట్టుకుని పోలేదూ భారత దేశంలో.

రాగి సంగటిలో తునకల కూర తింటున్నాడు తాతయ్య. ఎందుకలా నన్ను చూసి నవ్వుతాడు. నా పాటికి నేను అవకాడోలు, ఆకులూ వగైరా వేసుకుని డిన్నర్ చేస్తుంటే! సలాడ్ బౌల్ ఫోటో అప్లోడ్ చేసే ముందు ఫిల్టర్ వాడాల్సిందేం? 'గ్రీన్స్' ఇంకా గ్రీన్ గా పడేవేమో? కార్తీక మాసం ఎప్పుడు అయిపోతోంది? ఇప్పుడు ఎవరు ఆ నవ్వేది? గరికపాటి గారా లేక చాగంటి వారా? ఎందుకు అందరూ నన్ను చూసి నవ్వుతారు అలా.

"పార్కుల్లో, రెస్టారెంట్లలో, ప్రైవసీ లేదా? సినిమా హాల్లో ప్రశాంతంగా సినిమా చూడలేక పోతున్నారా? నవ భారత ప్రేమికుల్లారా బాధా లేదూ బెంగా లేదు. 'ఓయో రూమ్స్' ఇప్పుడు మీ పాకెట్ మనీ బడ్జెట్లో." ఓరి నాయనోయ్. ఇంకా భారత దేశాన్ని "డెవలపింగ్ " దేశం గానే ప్రస్తావిస్తున్నారా సోషల్ స్టడీస్ లో. ముందు ఫిసికల్ ఎడ్యుకేషన్, సెక్స్ ఎడ్యుకేషన్ నేర్పకుండా రేపటి పౌరులను ఇన్ని హక్కులు వాడుకోండని తోలేస్తున్నామా?

"భాద్యతలు ఎవడిక్కావాలోయ్ బోడి. మా హక్కులు మేము సాధిస్తాం. సముద్రాలు దాటేసావ్ ఇహ నువ్వు నోరుమూసుకు కూర్చో." ఎవరో మనోభావాలకు బర్నాల్ రాస్తున్నారు ఎక్కడో. అరచేతిలో లెక్కలేనన్ని వీడియోలు. మంచి కన్నా, గాలి కన్నా వేగంగా వెళ్లే చెడు. ఎందుకలా కవ్వించే వీడియోలు అన్నేసి? ఎదురుగా చీకట్లో అమ్మాయి. టైర్ పంక్చరయ్యిందా? ఎవరు వాళ్ళు? ఇదుగో అమ్మాయ్ పారిపో పారిపో. అబ్బా ఏమిటా దుర్గంధం? మనలో ఉండే కుళ్ళా?

ఈ విషయాలన్నీ చుట్టుకుంటున్నాయి, తేనెటీగల గుంపులా, కందిరీగల రొదలా. గిర్రున తిరుగుతున్నా నా చుట్టూ నేను. నిద్రపోతున్నానా? ఎక్కడున్నాను. ఇంటి ముందు వెలిసిపోయిన పొద్దున్న వేసిన ముగ్గు. సాదా సీదా రోజు అనుకుంటా, నాలుగు చుక్కల ముగ్గే. దాని పైనే గళ్ళు గీసి తొక్కుడు బిళ్ళ ఆడుకుంటుంటే. ఎవరదీ! అబ్బ ... జబ్బ పట్టుకుని లాక్కు వచ్చి పడేసారు.

ఫోను. ఇంకా తెల్లవారకుండానే! అరె ఆగకుండా మళ్ళీ మళ్ళీ చేస్తున్నారంటే అమ్మే అయుంటుంది.

"హలో! ఆ... మా! ఏంటమ్మా ... ఇంత త్వరగా చేసావూ? అబ్బా ...గుర్తుపెట్టుకోవే. ఇప్పుడు తేడా ఒకటిన్నర గంట అక్కడికీ ఇక్కడికీ. ఉంటా. కాసేపు ఆగి కాల్ చేస్తాను. ఆ ఆహ్ ... వీడియో చేసి పంపిస్తే సుధీరన్న పెళ్ళిలో ప్రొజెక్టర్ లో వేసి చూపిస్తారా? ఎట్లా వస్తాయే ఇట్లాంటి ఐడియాలూ. సరే నేను కాసేపాగి చేస్తా. హ్మ్ ...అబ్బా ప్లీజ్ అమ్మా ... సరే ఏంటి చెప్పు? ఏంటీ ...ఒక్క నిమిషం! అమ్మమ్మ ఆరో అక్కయ్య మూడో కొడుకు రెండో కూతురి పెళ్ళికి మా అత్తయ్య వాళ్ళని పిలవలేదా!! మా అత్తయ్య వాళ్ళు ఏమన్నా అనుకున్నారేమో అని నేను కనుక్కోవాలా?" సొంత మేనమామ కొడుకు ఇక్కడ ఇల్లు కట్టుకున్న సంగతి ఫేస్బుక్ లో వాడి పోస్టు చూస్తే గానీ తెలీలేదు నాకు. అమ్మతో 'సరే కనుక్కుంటా లే' అనేస్తే పోతుంది. ఇప్పుడు ఆ చుట్టరికం కోడ్ క్రాక్ చేసే మూడ్ లేదు.

"సరే మా. నే కనుక్కుని నీకు ఫోన్ చేస్తా మళ్ళీ. ఉంటా. ఆ ఆс. అలాగే. "

మళ్ళీ కాసేపు నిద్రపోదామంటే ఏదీ. ఒకదాని వెంట ఒకటి రైలు పెట్టెల్లా కల్లోకొచ్చిన సంఘటనలు. తేలిపోయింది నిద్ర. లేచి వెళ్లి వేడి నీళ్లలో నిమ్మకాయ, తేనె కలుపుకుని సోఫాలో కూర్చున్నాను. చలి చలి. కంఫోర్టర్ చుట్టుకుని సోఫాలో ముడుచుకుని కూర్చుని వేడివేడి గా తాగుతుంటే హాయిగా ఉంది. ఇంతలో ఒక అనుమానం. తేనె కలుపుకోవచ్చా లేదా ఉత్తి నిమ్మకాయ శ్రేష్టమా పరగడుపున అనీ! ఎక్కడో చదివాను. ఒకళ్ళు మంచిదంటే ఒకళ్ళు శుద్ధ దండుగ అని సెలవిచ్చారు. కల గుర్తొచ్చింది మళ్ళీ. ఇలా లేచిన దగ్గరినుండి ఇన్ని అనుమానాలతో ఇంత ఆన్లైన్ పాండిత్యంతో బుర్ర నింపేసుకుంటున్నానా? రాత్రి పడకెక్కితే ఎక్కడో అడుగున పడేసాననుకున్న విషయాలన్నీ ఇలా కల్లో డాన్సులు చేస్తున్నాయా? బుర్రలో ఇంత చెత్త పోగేస్తున్నానా నేను?

తెలీకుండానే 'లైక్, కామెంట్, షేర్' బటన్ల చుట్టూ జీవితం అల్లుకునిపోతోందా? ఎప్పుడూ ఎవడో చాటున నిలబడి నన్ను చూస్తున్న భావన. వాకింగ్ కి వెళ్ళాలి అంటే ఫోన్లలో, ఐప్యాడ్లలో, టీవీ లో షూ యాడ్లు. సోషల్ మీడియా ఓపెన్ చేస్తే ఎప్పుడైనా పొరపాటున ఒక వీడియో చూస్తే చాలు, నా ఇష్టాఇష్టాలను బేరీజు వేసేసి వాటికి లింకులు కట్టేసి ఓ... తెగ వీడియో సూచనలు. మనొక్కరి భావాలూ చాలవన్నట్టు ఎంతమంది ఉంటే అంతమంది భావాలూనూ. ఏదో ఒకే వీధిలో ఉండే వారు సాయంత్రం ఒక దగ్గర మాటాడుకుంటే బానే ఉంటుంది. అన్ని వీధుల వారు, అన్ని పేటల వారూ, అన్ని సందుల వారూ, అన్ని జిల్లాల వారూ, అన్ని దేశాల వారూ ఒక్క చోట చేరి ఏంటి ఈ పంచాయతీ? కేదారేశ్వరుడి నోములు చేసి జల్లెట్లో చందమామని తరువాత మొగుడిని చూసి నీళ్లు తాగినట్టు. అంతా కలగా పులగం బిసిబేళా బాత్!

అసలు పారిస్ ఎందుకెళ్లాలి అనుకున్నాను? ప్రపంచ చరిత్ర మీద ఆసక్తా? లేక ఫ్యాషన్ మీద మోజా? ఉహూ ... ఇవేమి కాదు. ఫ్రెండ్సంతా ఈఫిల్ టవర్ ముందు ఫోటోలు పెడుతున్నారు. నేను కూడా పెట్టేసేయ్యాలి. అంతే కదూ. నాకే ప్రదేశాలు ఇష్టం, నేనేంటి, నా మనసుకి నచ్చే పనులేంటి. కనుక్కోవాలి. నన్ను నేనే తెలుసుకోవాలి ముందు. మనం స్పందించి, ఆలోచించాల్సినవి పది విషయాలు అయితే ఉత్తి పోసుకోలు పనికిమాలిన చెత్త వెయ్యివంతులు. ముఖ్యమైనవి, పనికి వచ్చేవి మరుగున పడిపోతున్నాయి. మంచి చెడు తేడా తెలుసుకోగలిగే 'విజ్ఞులు' సరే. మిగతా వారు? ఎంత బ్రెయిన్ ట్యూనింగూ.

అయినా ఎవరో వస్తారని, ఏదో చెప్తారని ఎదురు చూడడం దేనికీ. మనకేం కావాలో, ఎక్కడ హద్దులు పెట్టుకోవాలో తెలీక పోతే ఈ చదువులు ఎందుకూ, ఆర్థిక స్వతంత్రాలు ఎందుకు? ఇద్దరు మనుషులకి 32కప్పుల ఇన్స్టా పాట్ కొని చివరికి అందులో పెరుగు తోడేసినట్టు ఉంది తెలివి. కామన్ సెన్స్ ఏదీ? ఇలాక్కాదు. నా సెట్టింగ్స్ నేనే మార్చేస్తా. రాకెట్ సైన్సు నుండి సేంద్రీయ ఎరువు వరకు తెలుసుకోవాల్సిన అవసరం లేదు. అన్ని ప్రపంచ సమస్యల మీద ఆలోంచింది జుట్టు పీక్కుని ఆవేశంగా అభిప్రాయాలూ గుప్పించక్కర్లేదు. వంద మంది భావాలూ నెత్తికెక్కించుకోవర్లేదు. ఈ 'నెగటివ్ ఫీడ్' వల్ల ఎంతటి మానసిక అశాంతి. అయినా శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు. ఎంచక్కా 'స్క్రోల్ డౌన్' చేసేయొచ్చు అదీ కాకపోతే 'అన్ ఫాలో' చేసేయొచ్చు. ఆహా... ఎంత వీజీ. అంతా నా చేతుల్లోనే ఉంది కదా. సాకులు వెతుక్కోవడం దేనికీ. హాయిగా పగడాల దీవిలో, పచ్చల మేడలో రాజహంసల మధ్య వెన్నెల విహారాల వంటి కలలు కనాలి గానీ! ఆమాత్రం సుఖానికి కూడా నోచుకోకపోతే ఏం సాధించినట్టూ!

అనుకున్నదే తడవు నా 'సోషల్ ఫీడ్' ని ప్రక్షాళన చేసి పడేసాను. అబ్బ ... ఎంత ప్రశాంతంగా ఉంది. డిసెంబరు మాసం కదా. ఎక్కడ చుసినా సంతోషంగా గెంతులు వేసే చిన్నా పెద్దా. ఈ హాలిడే సీజన్ వెలుగుల్లో ఈ 'నెగటివ్ ఫీడ్' నీడలు పారిపోవాలి దేవుడా! క్రిస్మస్ బహుమానాల కోసం పాప కట్టిన మేజోళ్లు! గది మూలగా పెట్టిన క్రిస్మస్ చెట్టుకి వేలాడుతూ ఉన్నాయ్. నేనూ ఈ క్రిస్మస్ కి నాకు కావలసిన బహుమానం చీటీ రాసి అందుట్లో పెట్టాను. తెలీకుండా కోల్పోతున్న 'మానసిక శాంతి' కోసం.

*(వచ్చేనెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*

Post your comments